క్లుప్తంగా

రైళ్ల హాల్టుల పునరుద్ధరణపై ఉత్తరాల ఉద్యమం



రైల్వే శాఖ మంత్రికి రాసిన ఉత్తరాలు చూపుతున్న ఉన్నత పాఠశాల విద్యార్థులు

కొవ్వూరు: స్థానిక రైల్వే స్టేషన్‌లో 2019 నాటికి ఆగే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులనూ పునరుద్ధరించాలని కోరుతూ కొవ్వూరు రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్తరాల ఉద్యమం నిర్విఘ్నంగా సాగుతోంది. రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని కోరుతూ గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు 300 పోస్టు కార్డులపై రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు ఉత్తరాలు రాశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.పద్మశ్రీ , కొవ్వూరు రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు వీటీ విల్సన్ రాజు, కేఎస్ రాజు, మారుతి, యాలం రమేష్, వైకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకుల అదృశ్యంపై కేసు నమోదు



షేక్ షబీనా



అర్షు

చాగల్లు: తన భార్య, ఆరేళ్ల కుమారుడు కనిపించడం లేదంటూ మండలంలోని ధారవరం గ్రామానికి చెందిన షేక్ మీరావలి గురువారం చాగల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ గ్రామానికి చెందిన 30 ఏళ్ల షేక్ షబీనా, ఆమె ఆరేళ్ల కుమారుడు అర్షు ఈనెల 22 నుంచి కనిపించడం లేదని మీరావలి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చాగల్లు ఎస్సై కె.నరేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొవ్వూరు: మండలంలోని దేచెర్ల గ్రామంలో అత్తిలి గ్రామానికి చెందిన విప్పర్తి సుబ్బలక్ష్మి అనే మహిళకు తన తండ్రి ద్వారా సంక్రమించిన కొంత పొలం ఉంది. ఆ పొలంలో తన చెల్లెలి కుమార్తె, ఆమె కుటుంబ సభ్యులు అక్రమంగా ప్రవేశించి పొలం పనులకు ఆటంకం కలిగిస్తున్నట్టు విప్పర్తి సుబ్బలక్ష్మి కొవ్వూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం కస్సే సత్యనారాయణ, కస్సే కనక మహాలక్ష్మి, కస్సే నవతాదేవి అనే ముగ్గురిపై కేసు నమోదు చేశామని రూరల్ ఏఎస్సై జె.ధర్మరాజు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

- 31 పోస్టులకు 100 మంది హాజరు
- ఆరుగురి గైర్హాజరు



ఆర్డీవో ఆఫీసులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీవో కృష్ణనాయక్, కమిటీ సభ్యులు

కొవ్వూరు: పెరవలి, గోపాలపురం, కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 30 ఆయా పోస్టులతో పాటు ఒక కార్యకర్త పోస్టు భర్తీకి గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అధ్యక్షతన డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సంధ్య, జిల్లా మహిళా,శిశుసంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి, ఆయా ప్రాజెక్టుల సీడీపీవోల సమక్షంలోని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. కొవ్వూరు ప్రాజెక్టు పరిధిలోని 12 ఆయా పోస్టుల భర్తీకి 49 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో నలుగురు హాజరు కాలేదు. గోపాలపురం ప్రాజెక్టు పరిధిలోని ఏడు ఆయా పోస్టులకు 31 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారంతా ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పెరవలి ప్రాజెక్టు పరిధిలోని 11 ఆయా పోస్టులకు 24 మంది దరఖాస్తు చేసుకోగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. ఇక గోపాలపురం ప్రాజెక్టు పరిధిలోని నల్లజర్ల మండలం చదరాసికుంటలో అంగన్‌వాడీ కార్యకర్త నియామకానికి ఇద్దరు అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కొవ్వూరు ఆరో వార్డు, 18వ వార్డుల్లో ఒక్కో ఆయా పోస్టు, పెనకనమెట్ట, వేములూరు, ఆరికిరేవుల, కుమారదేవం, తాళ్లపూడి మండలం మలకపల్లి, చాగల్లు మండలంలోని చంద్రవరం, గౌరిపల్లి, నెలటూరు, చిక్కాల, చాగల్లు గ్రామాల్లో ఒక్కో ఆయా పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. గోపాలపురం ప్రాజెక్టు పరిధిలోని దేవరపల్లి మండలం యర్నగూడెం, గౌరీపట్నం, గోపాలపురం మండలంలోని వేళ్లచింతలగూడెం, హుకుంపేట, నల్లజర్ల మండలంలోని చదరాసికుంట, నబీపేట, నల్లజర్ల గ్రామాల్లో ఆయా పోస్టులు భర్తీ చేయనున్నారు.పెరవలి ప్రాజెక్టు పరిధిలోని నడిపల్లిలో ఒకటి, అన్నవరప్పాడులో రెండు, ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను, మోర్త, పసలపూడి, తాడిపర్రు, నిడదవోలు మండలంలోని తిమ్మ రాజు పాలెం, జీడికుంట, కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి గ్రామాల్లో ఒక్కో ఆయా పోస్టు చొప్పున భర్తీ చేయనున్నారు. సీడీపీవోలు డి.మమ్మి, కె.నాగలక్ష్మి, ఎం.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వామి హుండీ ఆదాయం రూ.1.57 లక్షలు



అన్నవరప్పాడులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి వారి హుండీని అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో గురువారం తెరిచి లెక్కించారు. ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాల హుండీల ద్వారా 26 రోజులకు రూ.1,53,576 ఆదాయం వచ్చింది. అలాగే అన్నదాన హుండీ ద్వారా మరో రూ.3,205 ఆదాయం వచ్చింది. మొత్తం హుండీ ఆదాయం రూ.1,56,781 అని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ వెల్లడించారు. హుండీ ఆదాయాన్ని ఆలయాభివృద్ధికి వినియోగిస్తామని ఆయన తెలిపారు. తీపర్రు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎంవీ రామయ్య సమక్షంలో నిర్వహించిన హుండీల లెక్కింపులో అన్నవరప్పాడు గ్రామ పెద్దలు పంతం చిన్న, పంతం నాగేశ్వరరావు, రంగనీటి కట్లయ్య, ఓసూరి బాల నాగేశ్వరరావు, బొలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు సత్కారం

చాగల్లు: అంకితభావంతో విధులు నిర్వహించే ఉద్యోగులకు తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ ఎం.మెరికమ్మ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం పరిధిలో ఐదేళ్ల పాటు విధులు నిర్వహించి, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన అధికారులను గురువారం ఘనంగా సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ కె.నిరంజన్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.ఆనంద్ కుమార్, ఊనగట్ల గ్రామ రెవెన్యూ అధికారి బి.భాగ్యలక్ష్మి, చంద్రవరం గ్రామ రెవెన్యూ అధికారి బి.రాంబాబు, చిక్కాల గ్రామ రెవెన్యూ అధికారి సాయి సతీశ్‌రాజ్‌లు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహనా ర్యాలీ



దేవరపల్లి బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, వైద్యులు

దేవరపల్లి: గుండె వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ కార్డియాలజిస్టు, స్థానిక సుమంత్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత కె.సుమంత్ సూచించారు. ఈ నెల 29న గుండె దినోత్సవం సందర్భంగా గురువారం దేవరపల్లిలో భారీఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో తమ ఆసుపత్రి వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో 15 మంది వైద్య నిపుణులు రోగులకు ఉచితంగా సేవలు అందిస్తారని తెలిపారు. అన్నిరకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తామని, అవసరమైన వారికి మందులు అందజేస్తామని చెప్పారు. ర్యాలీలో ఎస్సై వి. సుబ్రహ్మణ్యం, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ కడియం సూర్యనారాయణ, టీడీపీ నాయకుడు గన్నమని హరికృష్ణ, జనసేన నాయకుడు కంబాల సత్తిబాబు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోర్డు అనుమతి మేరకే పొగాకు పండించాలి

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



పొగాకు వేలం కేంద్రం వద్ద రైతులతో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ తదితరులు

గోపాలపురం: పొగాకు బోర్డు అనుమతించిన మేరకు మాత్రమే పొగాకును ఉత్పత్తి చేయాలని, తద్వారా రైతులు గిట్టుబాటు ధరలు పొందవచ్చని గుంటూరు పొగాకు బోర్డు చైర్మన్ సి.యశ్వంత్‌కుమార్ అన్నారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, రైతులు తమ తోటలు తొలగించి పొగాకు సాగు విస్తీర్ణం పెంచడం వల్ల ఉపయోగం ఉండదన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వాహణాధికారి అమూల్ డీ శ్యామ్, రైతు సంఘం అధ్యక్షుడు ఇల్లూరి రాంబాబు, గౌరవాధ్యక్షులు పిన్నమనేని మధుమోహన్, గద్దే శేషగిరిరావు వేలం కేంద్రం పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీల స్వాధీనం

కొవ్వూరు: మండలంలోని సీతంపేట గ్రామంలో గోదావరి బ్యారేజీకి దిగువన అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను బుధవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు రూరల్ ఏఎస్సై జె.ధర్మరాజు తెలిపారు. ఎలాంటి అనుమతీ లేకుండా పడవల ద్వారా నదిలోని ఇసుకను ఒడ్డుకు చేర్చి లారీల్లోకి లోడింగ్ చేసుకుని బయటకు తరలిస్తున్నట్టు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో కలసి వెళ్లి చూడగా ఇసుక లోడింగ్ పూర్తయిన ఒక లారీ ఉందని, తమను (పోలీసులను) గమనించి మరో లారీలోని ఇసుకను అక్కడే అన్ లోడింగ్ చేసినట్టు ఆయన తెలిపారు. దీంతో రెండు లారీలనూ స్వాధీనం చేసుకుని రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. ఇద్దరు డ్రైవర్లు కమ్ ఓనర్లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.కొవ్వూరు తహసీల్దార్‌కు నివేదించినట్టు ఏఎస్సై ధర్మరాజు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిడదవోలు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన జరుగుతుంది.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరుకు చెందిన సింగం దుర్గాప్రసాద్ (31) అనే యువకుడు గురువారం ఇంటి వద్ద ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులే ఇందుకు కారణమని కొవ్వూరు పట్టణ పోలీసులు తెలిపారు. కొంతకాలం క్రితం దుర్గాప్రసాద్ తన భార్య నగలను బ్యాంకులో తాకట్టు పెట్టాడు. వాటిని రెనెన్యువల్ చేయించేందుకు గురువారం అతడి భార్య, తల్లి, తమ్ముడు బ్యాంకుకు వెళ్లారు. అదే సమయంలో దుర్గాప్రసాద్ ఇంటి వద్ద ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు పోలీసులు చెప్పారు. మృతుడి తండ్రి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

కొవ్వూరు: పట్టణంలోని శ్రీరామా కాలనీలో దళితులపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్ట్ చేయాలని ఏపీ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి ఆయన కాలనీలో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఘటనకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామ్‌నగర్, గణేశ్ చౌక్, ఓవర్ బ్రిడ్జి డౌన్, పోలీస్ స్టేషన్, గాంధీబొమ్మ సెంటర్, రైల్వే గేట్, బసివిరెడ్డిపేట, గణపతి సెంటర్, యర్నగూడెం రోడ్, నెహ్రూనగర్, విద్యానగర్, బాపూజీనగర్, వైఎస్సార్ నగర్, జగనన్న కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు వివరించారు.

నిడదవోలు మండలంలో..

నిడదవోలు రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం మండలంలోని తాడిమళ్ల సబ్ స్టేషన్ పరిధిలోని కోరుమామిడి, తాడిమళ్ల, మేడిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉండ్రాజవరం మండలంలో..

ఉండ్రాజవరం: ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా స్థానిక 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉండ్రాజవరం, సత్యవాడ, చిలకపాడు, తాడిపర్రు, వెలగదుర్రు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరాఫరా నిలిపి వేస్తామని ట్రాన్స్‌కో ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరాఫరా ఉండదన్నారు. కావున వ్యవసాయ, వాణిజ్య, గృహ విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.